# జల సంరక్షణలో మహిళలు ముందుండాలి: మంత్రి సీతక్క

విశ్వంభర, హైదరాబాదు : తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా విజయవంతం చేసి ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. దేశంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాలు గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమంలో ముందుండాలని కోరారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంటకుంట, ప్రతి గ్రామానికి ఊటకుంట ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనివల్ల భూగర్భ జలాలు పెరిగి భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించవచ్చని చెప్పారు. జల సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్న మంత్రి, నీటి పొదుపు, వర్షపు నీటి సంరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో మహిళల పాత్ర కీలకమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.



# బాబా సన్నిధిలో గురుపౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

విశ్వంభర, చింతపల్లి: చింతపల్లి మండల కేంద్రంలోని స్థానిక సాయిబాబా సన్నిధిలో గురుపౌర్ణమి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనుంజయ తెలిపారు. గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజన కార్యక్రమాలు, సత్సంగాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించడంతో పాటు తాగునీరు, క్యూలైన్లు, పార్కింగ్, భద్రత తదితర సౌకర్యాలను సిద్ధం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ సాయిబాబా ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.



# పాలకుర్తిలో జోరుగా అభివృద్ధి పనులు



విశ్వంభర, పాలకుర్తి : పాలకుర్తి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గ్రామాలు, తండాలాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఈ క్రమంలో రహదారులు,స్వయం సహాయక కమ్యూనిటీ భవనాల అభివృద్ధికి కొత్త పనులకు శంకుస్థాపనలు నిర్వహిస్తూనే, పూర్తయిన పనులను ప్రజలకు అంకితం చేస్తూ ప్రారంభోత్సవాలు చేపట్టారు. నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి నిత్యం ప్రజాక్షేత్రంలో పర్యటిస్తూ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. గ్రామాల్లో ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలను తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులను సద్వినియోగం చేస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి గ్రామం సమగ్రంగా అభివృద్ధి చెందేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలకుర్తి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

# రామంతాపూర్‌లో ఉచిత రేబీస్ టీకా శిబిరం

విశ్వంభర, రామంతాపూర్ : ప్రజల సహకారంతో రేబీస్ రహిత హైదరాబాదే మా లక్ష్యమని సిటిజన్స్ ఫర్ యానిమల్స్ ప్రతినిధులు తెలిపారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో హైదరాబాదు రామంతాపూర్‌లో ఉచిత యాంటీ రేబీస్ టీకా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 50కుపైగా పెంపుడు, వీధి కుక్కలు, పిల్లులకు రేబీస్ టీకాలు వేశారు. జూలై నుంచి సెప్టెంబర్ వరకు నగరంలో 3 వేల కుక్కలకు రేబీస్ టీకాలు వేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో పీపుల్ ఫర్ యానిమల్స్, హ్యూమేన్ వరల్డ్ ఫర్ యానిమల్స్, మధురోహా పెట్ కేర్, మిషన్ రేబీస్ ఇండియా, డబ్ల్యూవీఎస్ ఇండియా సంస్థల ప్రతినిధులు, పశువైద్య నిపుణులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



# చంద్రపురి కాలనీలో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి వినతిపత్రం



విశ్వంభర, ఎల్‌బీ నగర్: ఎల్‌బీ నగర్‌లోని చంద్రపురి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ఎల్‌బీ నగర్ జోన్ జనరల్ మేనేజర్ గారికి కాలనీ అధ్యక్షుడు సోమీ రెడ్డి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, 20 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. కాలనీలోని డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌లో పెద్ద మొత్తంలో సిల్ట్ పేరుకుపోవడంతో పాటు, అనేక మ్యాన్‌హోల్స్ దెబ్బతిని, మూతలు కూడా విరిగిపోయాయని వివరించారు. దీంతో ప్రతిరోజూ మురుగునీరు రోడ్లపైకి పొంగిపొర్లుతూ దుర్వాసన వెదజల్లడమే కాకుండా ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోడ్లు కూడా దెబ్బతింటున్నాయని తెలిపారు. అందువల్ల కాలనీలోని అన్ని మ్యాన్‌హోల్స్‌లో పేరుకుపోయిన సిల్ట్‌ను వెంటనే తొలగించి, దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్‌ను మరమ్మతు చేసి, విరిగిన మూతలను మార్చి డ్రైనేజీ నీరు సజావుగా ప్రవహించేలా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన అధికారులు సమస్యను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చంద్రపురి సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి ఉద్యమ విజయమే

విశ్వంభర, కాచిగూడ : కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి ఉద్యమ విజయానికి నిదర్శనమని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. హైదరాబాదు కాచిగూడ నుంచి బర్కత్‌పుర సిగ్నల్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించి అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. నీట్, సీయూఈటీ పరీక్షల నిర్వహణలో ఎన్‌టీఏ వైఫల్యాలు, విద్య కేంద్రీకరణ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థి ఉద్యమ ఫలితంగానే ఈ పరిణామం చోటుచేసుకుందని పేర్కొన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పోరాటం ముగియలేదని, ఎన్‌టీఏను రద్దు చేసి రాష్ట్రాలకే ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యత అప్పగించాలని, జాతీయ విద్యా విధానాన్ని వెనక్కి తీసుకునే వరకు ఉద్యమాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. సభకు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. అశోక్ రెడ్డి అధ్యక్షత వహించగా, టి. నాగరాజు, పుట్టా లక్ష్మణ్, మణికంఠ రెడ్డి, ఎస్. అనిల్, పి. మహేష్, నితీష్ ప్రసంగించారు. డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.డి. జావేద్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో లెనిన్, జూనుగరి రమేష్, నాగేంద్ర, కైలాష్, గ్యార నరేష్, అనిల్, హరీష్, నాగరాజు, శ్రీను, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ మజ్దూర్ సంఘ్ జాతీయ కార్యవర్గ సమావేశాలు ప్రారంభం



విశ్వంభర, రాంచీ : భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) 161వ అఖిల భారత జాతీయ కార్యవర్గ సమావేశాలు ఝార్ఖండ్ రాష్ట్ర రాజధాని రాంచీలో ఘనంగా ప్రారంభమయ్యాయి. బీఎంఎస్ జాతీయ అధ్యక్షుడు మల్లేశం అధ్యక్షత వహించి సమావేశాలను ప్రారంభించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి సురేంద్ర కుమార్ పాండే సమావేశాలను నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన ప్రతినిధులకు స్థానిక కార్యకర్తలు సంప్రదాయ జానపద నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సమావేశాల్లో కార్మికుల సంక్షేమం, కార్మిక చట్టాలు, ఉపాధి భద్రత, పారిశ్రామిక రంగానికి సంబంధించిన కీలక అంశాలతో పాటు సంఘం భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో పలు ముఖ్య తీర్మానాలు ఆమోదించే అవకాశం ఉంది.

# గ్రామాభివృద్ధే ధ్యేయం సర్పంచ్ మునగపాటి నవీన్



విశ్వంభర, మహేశ్వరం : మహేశ్వరం మండల కేంద్రంలోని పాత గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారంగా ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నవీన్ మాట్లాడుతూ, గ్రామంలో పెరుగుతున్న జనాభా, కొత్త కాలనీల విస్తరణతో విద్యుత్ వినియోగం అధికమై లో వోల్టేజ్ సమస్య తీవ్రరూపం దాల్చిందన్నారు. దీంతో టీవీలు, ఫ్రిజ్‌లు, ఇతర విద్యుత్ పరికరాలు దెబ్బతినడంతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిరంతరం సమన్వయం చేయడంతో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు సాధ్యమైందన్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌తో సంబంధిత ప్రాంతాల్లో విద్యుత్ వోల్టేజ్ మెరుగుపడి, నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందడంతో గృహ వినియోగదారులు, రైతులు, చిన్న వ్యాపారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు గ్రామ పంచాయతీ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జొరల రమేశ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి సుజాత, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ డేలో ఫిర్యాదులు స్వీకరించిన పోలీస్ కమిషనర్



విశ్వంభర, రామగుండం: రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రతి ఫిర్యాదుదారుతో పోలీస్ కమిషనర్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందిన ఫిర్యాదులను చట్టబద్ధంగా,పారదర్శకంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు పలు సూచనలు,ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్‌ఐలు,సీఐలతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదుల ప్రస్తుత స్థితిగతులను తెలుసుకుని,వాటి సత్వర పరిష్కారానికి అవసరమైన సూచనలు చేశారు. ప్రజలు ఎలాంటి భయం లేకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేదా పైరవీలు లేకుండా నేరుగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని,వారి సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించేందుకు పోలీసు శాఖ కట్టుబడి ఉందని పోలీస్ కమిషనర్ తెలిపారు. ప్రజలకు మరింత చేరువై, శాంతిభద్రతలను పరిరక్షిస్తూ, పారదర్శకమైన సేవలను అందించడమే రామగుండం పోలీస్ కమిషనరేట్ లక్ష్యమని పేర్కొన్నారు.ప్రజా సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను నేరుగా స్వీకరించి,వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రూ.15 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ పనులకు శ్రీకారం

## గ్రామంలో నీటి సమస్య లేకుండా చేస్తాం : సర్పంచ్ మునగపాటి నవీన్



విశ్వంభర, మహేశ్వరం : మహేశ్వరం మండల కేంద్రంలోని వివిధ కాలనీల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.15 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో నూతన తాగునీటి పైప్‌లైన్ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ మాట్లాడుతూ, గ్రామంలో ఏ ఒక్క కుటుంబం కూడా తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్త పైప్‌లైన్ ఏర్పాటు ద్వారా అన్ని కాలనీలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే గ్రామ పంచాయతీ లక్ష్యమని పేర్కొన్న ఆయన, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జొరల రమేశ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శి సుజాత, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం సాధన కమిటీ కార్యవర్గ సమావేశం విజయవంతం



విశ్వంభర, హైదరాబాద్: సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ మరియు రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈరోజు తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్ అధ్యక్షతన, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో సమాచార హక్కు చట్టం--2005 అమలు, సంస్థ భవిష్యత్తు కార్యాచరణ, రాష్ట్రవ్యాప్తంగా సంస్థ విస్తరణ, ప్రజల్లో అవగాహన పెంపు, ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ఏర్పాటు చేసే సలహా కమిటీలు, పర్యవేక్షణ కమిటీలు, అధ్యయన కమిటీలు ఇతర సంబంధిత కమిటీలలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సభ్యులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌ను కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించారు. అలాగే రాష్ట్రంలోని ప్రతి జిల్లా, నియోజకవర్గం, మండల మరియు గ్రామ స్థాయిలో సంస్థను మరింత బలోపేతం చేయడం, ప్రజలకు సమాచార హక్కు చట్టంపై ఉచిత అవగాహన కార్యక్రమాలు, శిక్షణా శిబిరాలు, న్యాయ మరియు సాంకేతిక మార్గదర్శక సేవలు అందించడం, ప్రభుత్వ శాఖల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ చేపట్టడం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారు.
ఈ సందర్భంగా జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్ మాట్లాడుతూ, లి"సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే శక్తివంతమైన ఆయుధం. ఈ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రభుత్వం, సమాచార కమిషన్ మరియు ప్రజా సంఘాలు పరస్పర సహకారంతో పనిచేయాలి. ప్రజలకు సమాచారం వేగంగా, పారదర్శకంగా అందే విధంగా వ్యవస్థలో అవసరమైన మార్పులు తీసుకురావాలి అని అన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసి ప్రతి గ్రామానికి సమాచార హక్కు ఉద్యమాన్ని తీసుకెళ్తామని తెలిపారు. సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, జాతీయ కార్యదర్శి తోట శ్రీనివాస్, జాతీయ సహాయ కార్యదర్శి అన్నవరం సందీప్ రెడ్డి,రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చింతల రాఘవేందర్,రాష్ట్ర కో కన్వీనర్ గడప కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాష్ పటేల్,అరవింద స్వామి,రాష్ట్ర కార్యదర్శులు రావుల నవీన్ కుమార్,కేడెల ప్రసాద్,మడుపు వేణు గోపాల్ రావ్,రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఏ.శ్రీకాంత్ రెడ్డి,శివ కుమార్ గౌడ్,అశోక్ కుమార్,రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గుడ్డేటి ప్రవీణ్,మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కొమ్ము అశోక్,నాగర్ కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షులు మంద సాయి బాబు తదితర జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.